క్లుప్తంగా

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



సాధించిన పతకాలతో విద్యార్థులు

నిడదవోలు: కేరళా రాష్ట్రంలోని కొచ్చిన్‌లో ఈనెల 11న జరిగిన సౌత్ ఇండియన్ కరాటే టోర్నమెంట్‌లో నిడదవోలుకు చెందిన స్పోర్ట్స్ కాంపో, కరాటే అసోసియేషన్ విద్యార్థులు వివిధ విభాగాల్లో పతకాలు సాధించారు. బోయి హర్షవర్ధన్ కుమిటి విభాగంలో మొదటి స్థానం, కటా విభాగంలో రెండో స్థానం సాధించారు. కాటం కార్తికేయ కటా, కుమిటి విభాగాల్లో రెండో స్థానంలో నిలిచాడు. బి.చైతన్య కుమిటి విభాగంలో మొదటి స్థానం, యు.వెంకటేష్ కటా విభాగంలో రెండో స్థానం సాధించారు. బాలికల విభాగంలో డి.గాయత్రి కటా విభాగంలో రెండో స్థానం సాధించింది. డి.యశ్వంత్ కటా విభాగంలో మొదటి స్థానం, కుమిటి విభాగంలో రెండో స్థానం సాధించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను స్పోర్ట్స్ కాంపో, కరాటే అసోసియేషన్ ఇన్‌స్ట్రక్టర్ జీవీ రమణ, సీనియర్ ఇన్‌స్ట్రక్టర్ డి.నాగేశ్వర రావులు అభినందించారు.

విద్యార్థులకు స్టీల్ కంచాల పంపిణీ

నిడదవోలు: తిమ్మరాజుపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు భోజన స్టీల్ కంచాలు పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ అయినీడి సత్యవతి జ్ఞాపకార్థం కుమారుడు మాజీ క్లబ్ అధ్యక్షుడు అయినీడి పల్లారావు ఆర్థిక సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు మీసాల శివరామ హరిప్రసాద్, కార్యదర్శి దారపురెడ్డి ప్రతాప్, గోపిరెడ్డి శ్రీనివాస్, గాజుల రంగారావు, ఎండీ ఫయాజ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హేమ మాధురికి వెండి పతకం



ప్రశంసా పత్రం, వెండి పతకంతో హేమ మాధురి

నల్లజర్ల: ప్రకాశరావుపాలెంలోని వైజ్ ఇంజినీరింగ్ కళాశాల నాలుగో సంవత్సరం విద్యార్థిని జి.హేమ మాధురి 49వ సీనియర్ టెన్నీకాయిట్ పోటీల్లో టీం ఛాంపియన్‌షిప్, వ్యక్తిగత డబుల్స్ విభాగంలో వెండి పతకాలు కైవసం చేసుకున్నట్టు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరవింద కుమార్ సోమవారం తెలిపారు. ఈ నెల 10, 11, 12 తేదీల్లో ఉత్తరప్రదేశ్ నోయిడాలో ఈ పోటీలు జరిగాయన్నారు. ఇప్పటికే హేమ మాధురి పలు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు అందుకున్నట్టు చెప్పారు. కరస్పాండెంట్ ఆకుల త్రిమూర్తి, హెచ్‌ఓడీలు, అధ్యాపకులు విద్యార్థిని అభినందించారు.

కొలువుదీరిన ఉపాధ్యాయులు

34 మంది నియామకం



ఉపాధ్యాయుల నుంచి జాయినింగ్ రిపోర్టులు తీసుకుంటున్న విద్యాశాఖ అధికారులు

దేవరపల్లి: నూతన ఉపాధ్యాయులుగా ఎంపికైన వారు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. దేవరపల్లి మండలానికి 34 మంది ఉపాధ్యాయులు ఎంపిక కాగా వీరిలో 30 మంది ఉన్నత పాఠశాలల్లో, నలుగురు ప్రాథమిక పాఠశాలల్లో చేరినట్టు మండల విద్యాశాఖ అధికారులు ఎం.తిరుమలదాస్, కేఆర్ఎస్‌వీవీ అప్పారావు తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన ఉపాధ్యాయులు మండల విద్యాశాఖ అధికారులకు జాయినింగ్ రిపోర్టు అందజేశారు. నూతన ఉపాధ్యాయులకు మండల విద్యాశాఖ అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. విధులను సక్రమంగా నిర్వర్తించి విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని ఎంఈఓలు ఉపాధ్యాయులకు సూచించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు తేజశ్రీ ఎంపిక



బిక్కవోలు: పందలపాకలోని పడాల పెద్ద పుల్లారెడ్డి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని పసగడుగుల తేజశ్రీ అండర్ – 19 రాష్ట్ర స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ, గొల్లల మామిడాడలో జీఆర్ఎస్‌ఏ ఫ్యామిలీ హెల్త్ క్లబ్‌లో జరిగిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అండర్ – 19 బాలికల పోటీల్లో తేజశ్రీ ఉత్తమ ప్రతిభ కనబరిచిందన్నారు. తద్వారా త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా తరఫున పాల్గొంటుందన్నారు. ఈ సందర్భంగా తేజశ్రీతో పాటు పీడీ ద్వారంపూడి యువరాజారెడ్డిని అభినందించారు. కార్యక్రమంలోని పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కొనాల సత్తిరాజు, నూతన పీడీ ద్వారంపూడి రామనాగ భీమేశ్వరరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



దేవరపల్లిలో అధికారికి వినతిపత్రం అందజేస్తున్న మాజీ హోంమంత్రి తానేటి వనిత, నాయకులు



దేవరపల్లి ఎక్సైజ్ కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడుతున్న మాజీ హోంమంత్రి తానేటి వనిత, పార్టీ నేతలు



నిడదవోలు ఎక్సైజ్ సీఐ సతీష్‌బాబుకు వినతిపత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు, వైఎస్సార్ సీపీ నాయకులు



నకిలీ మద్యంపై చర్యలు తీసుకోవాలని కొవ్వూరు ఎక్సైజ్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, వైఎస్సార్ సీపీ శ్రేణులు

నకిలీతో ఆటలొద్దు బాస్!

- ప్రజల ప్రాణాలతో కూటమి ప్రభుత్వం చెలగాటం
- ఎక్సైజ్ స్టేషన్ల వద్ద వైఎస్సార్ సీపీ శ్రేణుల నిరసనలు
- నకిలీ మద్యాన్ని అరికట్టాలని డిమాండ్

దేవరపల్లి: నకిలీ మద్యం అమ్మకాలపై వైఎస్సార్ సీపీ శ్రేణులు గళమెత్తారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు సోమవారం గోపాలపురం, కొవ్వూరు, నిడదవోలు నియోజకవర్గాల సమన్వయకర్తలు తానేటి వనిత, తలారి వెంకట్రావు, జి.శ్రీనివాసనాయుడు నాయకత్వంలో పార్టీ శ్రేణులు దేవరపల్లి, కొవ్వూరు, నిడదవోలు ఎక్సైజ్ ప్రొహిబిషన్ స్టేషన్ల వద్ద ధర్నా, నిరసన ప్రదర్శలను చేశారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఎక్సైజ్ ప్రొహిబిషన్ స్టేషన్ల వద్ద ధర్నా నిర్వహించి అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ప్రజల ప్రాణాలు తీస్తున్న నకిలీ మద్యాన్ని అరికట్టాలని, నారా వారి నకిలీ మద్యాన్ని నిషేధించాలని, బెల్టు దుకాణాలను ఎత్తివేయాలని, పర్మిట్ రూములను వెంటనే రద్దు చేయాలని, నకిలీ మద్యం నుంచి పేదల ప్రాణాలను కాపాడాలని, ఎన్ బ్రాండ్ నకిలీ మద్యం నిలిపివేయాలని పార్టీ శ్రేణులు నినాదాలు చేశారు. దేవరపల్లిలో మాజీ హోంమంత్రి తానేటి వనిత ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. దేవరపల్లి మండల పరిషత్ కార్యాలయం నుంచి నిరసన ప్రదర్శన ప్రారంభించారు. గ్రామ శివారున ఉన్న ఎక్సైజ్, ప్రొహిబిషన్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి.. అక్కడ కొద్దిసేపు ధర్నా నిర్వహించి అనంతరం అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తానేటి వనిత మాట్లాడుతూ, రాష్ట్రంలో నకిలీ మద్యం ప్రజల ప్రాణాలను తీస్తుందన్నారు. నకిలీ మద్యం వీధుల్లో ఏరులై పారుతుందన్నారు. అయినా కూటమి ప్రభుత్వ ఆదేశాలతో అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల ప్రాణాలు పోతున్నా ప్రభుత్వం పట్టించుకోదా? అని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఆధీనంలో ఉన్న మద్యం దుకాణాలను రద్దు చేసి కూటమి ప్రభుత్వంలో వారి నాయకులకు కట్టబెట్టిందని ఆమె అన్నారు. రాష్ట్రంలో కుటీర పరిశ్రమలుగా నకిలీ మద్యం తయారీ కేంద్రాలు ఉన్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో నల్లజర్ల, గోపాలపురం మండలాల పార్టీ అధ్యక్షులు వెల్లంకి సుబ్రహ్మణ్యం, వెలగా శ్రీరామమూర్తి, ఎంపీపీలు కేవీకే దుర్గారావు, ఉండవల్లి సత్యనారాయణ, ఏఎంసీ మాజీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు నక్కా పండు, రాష్ట్ర కార్యదర్శి సత్తి సాయి ఈశ్వరరెడ్డి, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు వల్లభనేని సత్యనారాయణ, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి నరహరిశెట్టి రాజేంద్రబాబు, నియోజకవర్గ అధ్యక్షుడు సత్తి జగదీశ్వరరెడ్డి, మండల అధ్యక్షులు పల్లి రత్నారెడ్డి, పార్టీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కుసులూరి వెంకట సతీష్, నియోజకవర్గ మైనార్టీ విభాగం అధ్యక్షుడు ఎస్‌కే ముస్తఫా, మండల మహిళా అధ్యక్షురాలు కడలి హైమావతి, మండల యువజన విభాగం అధ్యక్షులు అనిశెట్టి సూర్యచంద్రరావు, నాలుగు మండలాలకు చెందిన పార్టీ నాయకులు, గ్రామ కమిటీ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కొవ్వూరులో ఆందోళన చేస్తున్న కౌన్సిలర్లు, మహిళా నేతలు

ప్రజల ప్రాణాలు కాపాడాలి

నిడదవోలు : రాష్ట్రంలో నకిలీ మద్యాన్ని అరికట్టి, ప్రజల ప్రాణాలు కాపాడాలని పార్టీ నిడదవోలు నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు అన్నారు. నిడదవోలులోని ఎక్సైజ్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. నకిలీ మద్యంపై సీబీఐ దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేస్తూ జి.శ్రీనివాసనాయుడు, నిడదవోలు, కొవ్వూరు పరిశీలకులు గిరజాల బాబు, పార్టీ నాయకులు కలిసి నిడదవోలు ఎక్సైజ్ సీఐ జయరాజ్ సతీష్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం శ్రీనివాసనాయుడు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నకిలీ మద్యం రాష్ట్రంలో ఏరులై పారుతోందన్నారు. చిత్తూరు జిల్లాలో టీడీపీ నాయకుడు, వారి అనుచరులు నకిలీ మద్యం తయారు చేశారన్నారు. టీడీపీ నాయకులు నకిలీ మద్యం తయారీ చేసి, బెల్ట్ షాపులు ఏర్పాటు చేసి అమ్మకాలు జరుపుతున్నారని పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలు తీసేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా దీనిని తయారు చేసేవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కామిశెట్టి సత్యనారాయణ, పార్టీ రాష్ట్ర రైతు విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ బూరుగుపల్లి సుబ్బారావు, కౌన్సిలర్లు పిట్టా పద్మావతి, పడాల శిరీష, నాయకులు ఎస్‌కే ఖాన్‌భాషా, గజ్జరపు రమేష్, తోలేటి కోటేశ్వరరావు పాల్గొన్నారు.



దేవరపల్లి ఎంపీపీ కార్యాలయం నుంచి ఎక్సైజ్ స్టేషన్‌కు ప్రదర్శనగా వెళుతున్న తానేటి వనిత, పార్టీ శ్రేణులు

నకిలీ మద్యంతో జేబులు నింపుకుంటున్నారు

తాళ్లపూడి: నకిలీ మద్యం ద్వారా సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌లు రూ.13 వేల కోట్లు జేబుల్లో వేసుకున్నారని, కూటమి ప్రభుత్వంలో ఏడాది కాలంలో నకిలీ మద్యం తాగి 421 మంది ప్రాణాలు కోల్పోయారని వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ కో–ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. కొవ్వూరులో ఎక్సైజ్ శాఖ కార్యాలయం వద్ద చంద్రబాబు ప్రభుత్వానికి వ్యతిరేకంగా తలారి వెంకట్రావు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులతో కలిసి ఆందోళన నిర్వహించారు. మహిళలు, నాయకులు ప్లకార్డులు పట్టుకొని ర్యాలీగా వెళ్లి నిరసన తెలిపారు. అనంతరం కొవ్వూరు ఎక్సైజ్ సీఐ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. తలారి వెంకటారావు మాట్లాడుతూ, ఏడాదిన్నర కాలంగా నకిలీ మద్యంతో కూటమి నాయకులు జేబులు నింపుకుంటున్నారని మండిపడ్డారు. ఇది ఒక కుటీర పరిశ్రమ లాగా లేబుళ్లు తయారు చేసి, స్పిరిట్‌తో నకిలీ మద్యం తయారు చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. రాష్ట్రంలో 75 వేల బెల్టు షాపులు పెట్టి మద్యం ఏరులై పారిస్తున్నారన్నారు. చిన్న గ్రామంలో కూడా 12 నుంచి 15 బెల్ట్ షాపులు పెట్టారన్నారు. నకిలీ మద్యం ద్వారా మంత్రి లోకేష్ రూ.40 వేల కోట్ల టార్గెట్ పెట్టుకున్నారన్నారు. నకిలీ మద్యం స్కాం చంద్రబాబుకు ముందే తెలుసన్నారు. రాష్ట్రంలో చనిపోయిన మృతుల కుటుంబాలకు నష్టపరిహారం అందజేయాలన్నారు. దీనిపై సీబీఐ విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కంఠమణి రమేష్, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు రుత్తల భాస్కర్‌రావు, సుంకర సత్యనారాయణ, పరిమి సోమరాజు, కొవ్వూరు మండల క న్వీనర్ వెంపాటి సురేష్, తాళ్లపూడి ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, కొవ్వూరు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్‌లు మన్నే పద్మ, గండ్రోతు అంజలి, కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గండ్రోతు సురేంద్రకుమార్, నాయకులు ఇంటి వీర్రాజు, జుట్టా ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ శాఖలో కుల వివక్షత నిర్మూలించాలి

నల్లజర్ల: రాష్ట్రం, దేశంలోని పోలీస్ శాఖలో కుల వివక్షతను నిర్మూలించాలని దళిత సేన వ్యవస్థాపక అధ్యక్షుడు రవిప్రకాష్ డిమాండ్ చేశారు. మండలంలోని ఆవపాడులో సోమవారం ముఖ్య నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ, ఏపీ కేడర్‌కు చెందిన హరియాణా ఐపీఎస్ ఏడీజీపీ పూరనా కుమార్ కుల వివక్షత కారణంగా ఆత్మహత్య చేసుకున్నారని, అందుకు కారకులైన ఆ రాష్ట్ర డీజీపీ, ఎస్పీలను సస్పెండ్ చేసి వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. ఇందుకు రాష్ట్ర, జాతీయ ఎస్సీ కమిషన్లు చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పశ్చిమగోదావరి జిల్లా దళిత సేన అధ్యక్షుడు చీలిమోహనరావు, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు దిరిసిపాము కృష్ణమూర్తి, ఏలూరు జిల్లా ఉపాధ్యక్షుడు పెదపాటి ఏసురత్నం, నల్లజర్ల మండల చర్మకారుల అధ్యక్షులు దొండపాటి సువర్ణరాజు, ఆవపాడు గ్రామ అధ్యక్షులు ఇల్లందుల ఏసు, గోపాలపురం గ్రామ అధ్యక్షులు భీమడోలు చంద్రయ్య, గోపాలపురం ఉపాధ్యక్షులు చదలవల శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఆవపాడులో దళిత సేన నాయకులతో రవిప్రకాష్

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



కానూరులో సామూహిక సీమంతాలు చేస్తున్న సీడీపీఓ ఆశా రోహిణి

పెరవలి: గర్భిణులు ఆరోగ్యంగా ఉండటం కోసం సమతుల్య ఆహారం తప్పనిసరిగా తీసుకోవాలని, అప్పుడే తల్లీబిడ్డ ఆరోగ్యవంతంగా ఉంటారని సీడీపీఓ ఆశా రోహిణి తెలిపారు. కానూరు సెక్టార్ పరిధిలోని ఉసులుమర్రు, కానూరు అగ్రహారం, నడుపల్లి, కానూరు గ్రామాల అంగన్వాడీ కార్యకర్తలతో సమావేశం, పోషణ కార్యక్రమం నిర్వహించారు. కానూరు అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, కిషోర్ బాలికలు పౌష్టికాహారం సక్రమంగా తీసుకోవాలన్నారు. అందుకోసం ఆకుకూరలు, బెల్లంతో చేసిన వేరుశెనగ అచ్చులు తీసుకుంటే సరిపోతుందన్నారు. వీటిని ప్రతి రోజు ఆహారంలో తీసుకుంటే రక్తహీనత ఉండదని, బిడ్డ ఆరోగ్యవంతంగా పుడుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ భావన మధు, జెడ్పీటీసీ సభ్యురాలు కొమ్మిశెట్టి రామాంజని, ఎంపీటీసీ సభ్యులు కోలా లక్ష్మీ సీతయ్య నాయుడు, నాయకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

16న కోటసత్తెమ్మ హుండీల ఆదాయం లెక్కింపు

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెంలో వేంచేసియున్న శ్రీ కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయంలోని హుండీలను ఈ నెల 16వ తేదీ ఉదయం 8 గంటలకు తెరచి, ఆదాయం లెక్కించనున్నారు. ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్ సోమవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి



బస్సు ఢీకొని స్కూటరిస్ట్ మృతి

నల్లజర్ల: స్థానిక ఫ్లైఓవర్ వద్ద సోమవారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. ద్వారకా తిరుమలకు చెందిన కర్రి రామచంద్రరావు (45) నల్లజర్లలోని ఓ హోటల్‌లో పనిచేస్తున్నాడని, తన పని ముగించుకొని ఇంటికి స్కూటీపై వెళ్తుండగా తాడేపల్లిగూడెం నుంచి జంగారెడ్డిగూడెం వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టిందన్నారు. ఈ సంఘటనలో తలకు బలమైన గాయం కావడంతో రామచంద్రరావు అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

అగ్ని ప్రమాద బాధితులకు వితరణ



బాధితులకు సామగ్రి, నిత్యావసరాలు అందజేస్తున్న గిరజాల బాబు తదితరులు

కడియం: గ్రామంలోని పెద్ద చెరువు సమీపంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులను బాధ్యత సేవా సంస్థ ఆదుకుంది. ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు నేతృత్వంలో సభ్యులు సోమవారం బాధితులకు దుస్తులు, బియ్యం, వంట సామగ్రి, పప్పులు, గృహోపకరణాలు అందజేశారు. రెండు రోజుల క్రితం ప్రమాదం జరిగినప్పుడు తక్షణమే బాబు అక్కడికు చేరుకుని, తన మిత్రులు, స్థానికుల సహకారంతో మంటలను అదుపు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువకులు ఎంతో సాహసంతో కాలిపోతున్న గ్యాస్ సిలిండర్‌ను చాకచక్యంగా బయటికి తీసుకొచ్చి ప్రమాదాన్ని కొంతమేర నిలువరించగలిగారన్నారు. అధికారులు తక్షణం స్పందించి బాధితులకు ప్రభుత్వం తరఫున ఆర్థిక సాయాన్ని అందించాలన్నారు. దాతలు, స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో బాధ్యత సభ్యులు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయులు చిలుకూరు శ్రీనివాస్, షేక్ మహమ్మద్ సర్కార్ బాషా, పున్నమి రాజు వీర్రాజు, కడియం గణేష్, సూరిశెట్టి వెంకట్లు, కామిరెడ్డి దుర్గారావు, బైరిశెట్టి బాబ్జీ, రావిపాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన



పోతవరంలో గ్రామస్తులకు సీపీఆర్‌పై అవగాహన కలిగిస్తున్న డాక్టర్ శైలజ

నల్లజర్ల: సీపీఆర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పోతవరం పీహెచ్‌సీ డాక్టర్ శైలజ అన్నారు. ఈ నెల 13 నుంచి 17 వరకు సీపీఆర్ అవగాహన వారంగా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సోమవారం సీపీఆర్‌పై (కార్డియో పల్మనరీ రిససిటేషన్) ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గుండె ఆగినప్పుడు శ్వాస తీసుకోలేని పరిస్థితుల్లో ప్రాణాలను కాపాడటానికి ఉపయోగించే అత్యవసర ప్రక్రియ అని అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలు కాపాడటానికి ఈ తరహా శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. గుండె ఆరోగ్యం ప్రతి ఒక్కరికి ఎంతో అవసరమన్నారు. సీపీఆర్ చేస్తుండగానే అంబులెన్స్‌కు ఫోన్ చేయాలన్నారు. సీపీఆర్ ద్వారా రక్తం సరఫరా బాగా జరిగి కొంత సమయం ప్రాణాలతో ఉండగలుగుతారు. ఎమర్జెన్సీ మెడికల్ హెల్ప్ అనేది సీపీఆర్ ప్రారంభించక ముందే చేయాలన్నారు. సీపీఆర్ చేసే సమయంలో మీ చేతులను మాత్రమే నిమిషానికి 100 నుంచి 120 కంప్రెషన్లు చేయాలి. ప్రజలు ఈ ప్రాణాలను రక్షించే నైపుణ్యాలను నేర్చుకోవడానికే అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు.

మిన్నంటిన కుంతీదేవి సంబరం



నల్లజర్లలో కుంతీదేవి (గొంతెమ్మ) గ్రామోత్సవం

నల్లజర్ల: స్థానిక అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కుంతీదేవి (గొంతెమ్మ) గ్రామోత్సవ సంబరం అంబరాన్నంటింది. విజయదశమి తర్వాత దళితుల కులదైవం గొంతెమ్మ ఉత్సవాలు ప్రారంభమవుతాయి. చెరువు మట్టి, నూనెతో భక్తిశ్రద్ధలతో అమ్మవారి విగ్రహాన్ని, నందీశ్వరుణ్ణి తయారు చేసి ప్రత్యేక పూజలు, నైవేద్యాలు తర్వాత ప్రత్యేక వాహనంపై అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు. స్థానికులు అమ్మవారి వాహనానికి పూలు, పళ్లు సమర్పించారు. బ్యాండ్ మేళాలు, బాణసంచా కాల్పులతో ఊరేగింపు సాగింది. అనంతరం అమ్మవారి విగ్రహాన్ని కోనేరులో నిమజ్జనం చేశారు. కమిటీ సభ్యులు గుదే వెంకట సుబ్బారావు, రాంబాబు, గారపాటి సత్యనారాయణ, కుమార్, రామకృష్ణ గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప బృందం, సొసైటీ చైర్మన్ రావూరి వెంకటరమణ, భేతిన దుర్గారావు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

మెట్టలో కుండపోత

- వరుణుడి రాకతో రోడ్లు జలమయం
- కొవ్వూరు డివిజన్‌లో 126.6 మిల్లీమీటర్ల వర్షం

దేవరపల్లి: మెట్ట ప్రాంతంలో వర్షం దిమ్మరపోసింది. సోమవారం ఉదయం 7 నుంచి 9 గంటల వరకు ఎడతెరిపి లేకుండా కుండపోత వర్షం కురిసింది. వర్షానికి పలు గ్రామాల్లో పల్లపు ప్రాంతాలు, రోడ్లు జలమయం కావడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడ్డారు. డ్రైనేజీలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దేవరపల్లిలోని డ్రైనేజీల్లో పంచాయతీ అధికారులు జేసీబీతో నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా తొలగింపు చర్యలు చేపట్టారు. దేవరపల్లి- పల్లంట్ల రోడ్డు, స్థానిక తహసీల్దార్ కార్యాలయం రోడ్డు జలమయం కావడంతో రాకపోకలకు ప్రజలు, ఉద్యోగులు ఇబ్బంది పడ్డారు. బంగారు పాపమ్మ ఆలయం వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. వర్షం వల్ల పొగాకు నాట్లకు కొంత ఆటంకం ఏర్పడిందని రైతులు తెలిపారు. వరి చేలు కోతకు రావడంతో రైతులు కలవరపడుతున్నారు.

126.6 మిల్లీమీటర్ల వర్షపాతం

కొవ్వూరు డివిజన్‌లోని తొమ్మిది మండలాల్లో 126.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. నల్లజర్ల మండలంలో అత్యధికంగా 48.0 మిల్లీమీటర్లు, కొవ్వూరు మండలంలో అత్యల్పంగా 6.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. నల్లజర్లలో 48.8 మిల్లీమీటర్లు, గోపాలపురంలో 12.8 మిల్లీమీటర్లు, తాళ్లపూడిలో 11.2 మిల్లీమీటర్లు, నిడదవోలులో 11.0 మిల్లీమీటర్లు, చాగల్లులో 10.8 మిల్లీమీటర్లు, పెరవలిలో 9.2 మిల్లీమీటర్లు, దేవరపల్లిలో 9.2 మిల్లీమీటర్లు, ఉండ్రాజవరంలో 8.0 మిల్లీమీటర్లు, కొవ్వూరులో 6.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.



వర్షానికి జలమయమైన దేవరపల్లి-పల్లంట్ల రోడ్డు



దేవరపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిలిచిపోయిన వర్షపు నీరు